అంతుచిక్కని ఓటరు నాడి.. నాయకుల్లో ఆందోళన

- పైకి ధీమా.. లోపల బెంగ
- ఎవరి లెక్కల్లో వారు బిజీ

అంబర్‌పేట, మే 14 : అంబర్‌పేట నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ సరళి ఆయా పార్టీల నాయకులను ఆందోళనలో పడేసింది. ఓటరు నాడి అంతుపట్టకపోవడంతో సంప్రదాయ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు. పోలింగ్ తీరు, బూత్‌ల వారీగా పోలైన ఓట్ల జాబితాను పట్టుకొని లెక్కలు వేసుకుంటూ మంగళవారం బిజీగా గడిపారు. ఐదు డివిజన్లు బూత్‌లలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయి ? తమకు ఎక్కువ ఓట్లు పడ్డట్లు తెలుస్తున్నదని, వేరొక బూత్‌లో ఎదుటి పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడినట్లు సమాచారం ఉందంటూ చర్చించుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అనుచరులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ ఉండటం.. పోలింగ్ తీరు సరిగ్గా పసి కట్టకపోవడంతో ఆయా పార్టీల నాయకుల్లో పైకి ధీమా కనిపిస్తున్నా.. లోపల బెంగ పట్టుకున్నట్లు తెలుస్తున్నది.

తెలంగాణ జిల్లాల నుంచి వచ్చిన వారే అధికం..

డివిజన్లలోని బస్తీల్లో తెలంగాణ జిల్లాల నుంచి వచ్చి నివాసముంటున్న వారే అధికంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పథకాలు వీరిని ఆకట్టుకుంటాయని, వారి ఓట్లు మొత్తం బీఆర్‌ఎస్‌కే పడ్డాయని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ చేసిన పథకాలను వివరించడం జరిగిందని, పార్టీ ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీ గెలుపుకోసం పని చేశాడని గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ వ్యక్తిత్వం మంచిదని, ఆయనను గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉంటాడని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు జోరుగా ప్రచారం చేయడం వంటివి బీఆర్‌ఎస్‌కు అధిక సంఖ్యలో ఓట్లు పడేలా చేస్తాయని అనుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మైనార్టీ ఓటర్లు బీఆర్‌ఎస్‌కే ఓటు కూడా వేశారని భావిస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు సైలెంట్ ఓట్లు అధికంగా పడ్డాయని.. ధీమాతో ఉన్నారు.

ఇక బీజేపీ ఎంపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, ప్రధాని మోడీ ప్రభావం ఎక్కువగా ఉండడం, రామ మందిర నిర్మాణం జరుగడం వంటివి అనుకూల అంశాలుగా చెప్పుకుంటున్నారు. వ్యక్తి ముఖ్యం కాదని మోడీ ముఖ్యమని భావించిన అంబర్‌పేట ఓటర్లు తమ ఓటును బీజేపీకి వేసినట్లు చెప్పన్నారు. పోలింగ్ సరళి కూడా తమకే అనుకూలంగా ఉందని నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. విజయంపై ఎవరి ధీమా వారిదే అన్న చందంగా పరిస్థితి నెలకొన్నది. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అంబర్‌పేట నియోజకవర్గంలో తనకు ఓట్లు బాగానే పడతాయని భావిస్తున్నారు. ఇప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేశారని, మైనార్టీల ఓట్లు అన్నీ తనకే పోలయ్యాయని భావిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ ఖాయం

సమావేశంలో మాట్లాడుతున్న ముఠా జయసింహ

ముషీరాబాద్, మే 14 : బీఆర్‌ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం విద్యానగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టడంలో బీఆర్‌ఎస్ శ్రేణులు కీలక పాత్ర పోషించారని, ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. శాసన సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను గెలిపించడానికి కృషి చేసిన విధంగానే ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు కోసం కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యేకు వచ్చిన మెజార్టీ కంటే ఎంపీ అభ్యర్థి ఎక్కువ సాధించబోతున్నారని తెలిపారు. పదేండ్లుగా కేసీఆర్ తెలంగాణను ఎలా అభివృద్ధి చేశారో.. ప్రజలు గుర్తు చేసుకుంటూ బీఆర్‌ఎస్ ఓట్లు వేశారని, వచ్చే నెల 4న గెలుపు సంబురాలకు బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వి.సుధాకర్ గుప్త, కె.సురేందర్, రవి యాదవ్, నేత శ్రీనివాస్, మహ్మద్ ఖదీర్, ఎ.శ్రీనివాస్, దీన్‌దయాల్ రెడ్డి వల్లాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రమించిన నాయకులు, కార్యకర్తకలకు కృతజ్ఞతలు..

చిక్కడపల్లి : బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ప్రచారంలో శ్రమించిన ముషీరాబాద్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలకు బీఆర్‌ఎస్ యుజన విభాగం నాయకుడు ముఠా జయసింహ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లో పార్టీలో కార్యాలయంలో జయసింహ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ గెలుపు కోసం ఎర్రటి ఎండాను లెక్క చేయకుండా ప్రచారం చేశారని తెలిపారు. నాయకులు కార్యకర్తల శ్రమకు మంచి ఫలితం వస్తుందని, బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు.

24 నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఝూంసింగ్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం

కార్వాన్, మే 14 : చారిత్రాత్మకమైన గుడిమల్కాపూర్‌లోని శ్రీ ఝూంసింగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి బ్రహ్మోత్సవాలు 24న ప్రారంభమై 30 వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 28 న శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవం, అదే రోజు రాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్ సింగ్, ఆలయ ఈఓ కృష్ణారావు నేతృత్వంలో ప్రధాన అర్చకులు అంబారిపేట శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజారులు పూజా కార్యక్రమాలను చేపట్టారు.

న్యాయవాది సాయి చంద్రహాస్‌కు గ్లోబల్ ఎక్సెలెన్సీ అవార్డు

సినీనటి శిల్పాశెట్టి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న న్యాయవాది సాయి చంద్రహాస్

జూబ్లీహిల్స్,మే 14: యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన యువ న్యాయవాది ఎం.సాయి చంద్రహాస్‌కు గ్లోబల్ ఎక్సెలెన్సీ అవార్డు (జీఈఏ) వరించింది. బ్రాండ్ ఎంపవర్ సంస్థ దేశంలో ప్రతి ఏటా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని ఎంపికచేసి ఈ అవార్డులు అందిస్తుంది. మంగళ వారం ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో న్యాయవాది చంద్రహాస్ సినీనటి శిల్పాశెట్టి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అరుదైన అవార్డు దక్కడం పట్ల చంద్రహాస్ తల్లిదండ్రులు ఎంఎం నాయుడు, కిరణ్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మైలార్‌దేవ్‌పల్లి, మే 14: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంతకర్ అన్నారు. మంగళవారం గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ) సహకారంతో ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈడీపీ) నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ హాజరై ప్రారంభించి, మాట్లాడుతూ.. ఈ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల నైపుణ్యాలు, వ్యాపారాలను అభివృద్ధి చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చునన్నారు. ఎస్ఐడీబీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందిస్తున్న పథకాలను వివరించి చిన్న వ్యాపారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో ఎస్ఓఎస్ సంస్థ ద్వారా లబ్ధిపొందుతున్న మహిళలు, ఎస్ఓఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మనవడితో.. ఆటవిడుపు

మనవడిని ఆడిపిస్తూ కాలక్షేపం చేస్తున్న హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్, మే 14 : ఎన్నికల ప్రచారంలో క్షణం తీరిక లేకుండా గడిపిన నాయకులు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ మంగళవారం తన మనవడు అహన్‌ను ఆడిపిస్తూ కాలక్షేపం చేశాడు. గౌలిగూడలో నివసించే శ్రీనివాస్ యాదవ్‌ను ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం చేపట్టడంతో పాటు పార్టీ కార్యకలాపాల్లో తలమునకలై గడిపారు.

కిషన్ రెడ్డి విజయం ఖాయం..

మాజీ కార్పొరేటర్ రవీందర్

కవాడిగూడ, మే 14 : సికింద్రాబాద్ ఎంపీగా కిషన్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు టి. రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం దోమలగూడలోని అడ్వకేట్ కాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 15 ఏండ్లుగారాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మద్దతుగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుకుని.. అక్రమ నిర్మాణం

జమాల్‌బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుకుని వెలిసిన అక్రమ నిర్మాణం

కాచిగూడ,మే 14 : జమాల్ బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ అనుకుని అక్రమ నిర్మాణం వెలిసింది. అసలే ఇపుడు వేసవి సెలవులు.. వానలు పడినపుడు ప్రమాదం జరిగితే పరిస్థితి ఎంటని స్థానికులు వాపోతున్నా రు. వివరాల్లోకి వెళితే.. పాత కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, ఏకే భవన్ రోడ్, జమాల్‌బస్తీలో అనుమతులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే అక్రమ నిర్మాణం వెలసింది. బస్తీలో 350 కుటుంబాలు నివసిస్తుంటాయి. చిన్నారులు ఆడుకుంటూ అటు పోతే ఎలా.. అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు ఆరోపించారు.

రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

- మూడేండ్లుగా విధుల్లోలేని ఎస్సైలు

కాచిగూడ, మే 14 :కార్పొరేట్ స్థాయిలో ఉండి ఏ –1 రైల్వే స్టేషన్ గుర్తింపు పొందినా.. తొలి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతతో కేసుల పరిష్కారం జాప్యం అవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం రైల్వేస్టేషన్ నుంచి 60–80 వేల మంది తమ తమ గమ్యస్థానాలకు వెళ్తుంటారు.ఎస్సైలు బదిలై మూడేండ్లు కావస్తున్నా ఇప్పటికీ అధికారులు నిమమించకపోవడం గమనార్హం. ఇక్కడ ముగ్గురు ఎస్సైలు ఉండాలి. కానీ.. 13 మంది హెడ్‌కానిస్టేబుల్ ఉండాల్సి ఉండగా 11 , 53 మంది కానిస్టేబుల్స్ ఉండాల్సి ఉండగా 14 మంది, 8 మంది హోంగార్డులు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. ఇది విడ్డురంగా ఉందని.. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొదటిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది

మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉందని గుడిమల్కాపూర్‌నకు చెందిన సాయిముదిరాజ్ అన్నారు. తల్లిదండ్రులతో కలిసి ఓటు వేయడం జీవితంలో మరిచిపోలేని రోజు అని యువ ఓటరు తెలపారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాంపల్లి, హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని గోషామహల్, కార్వాన్ నియోజకవర్గాల నుంచి 1500 నుంచి 2000 మంది నూతన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

–మెహిదీపట్నం

అభినందనలు..

ఓంకార్‌ను అభినందిస్తున్న హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ

అబిడ్స్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేసిన నాటి జన సంఘ్ కార్యకర్త ఓంకార్‌ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు. 82 ఏండ్ల వయసులో కూడా ప్రజాస్వామ్యంపై నమ్మకంతో ఇంటింటికీ తిరిగి ఓటు హక్కుపై ఓంకార్ ప్రచారం చేశారు. గౌలిగూడలోని తన వదిన అనారోగ్యంగా ఉండడంతో ఆమెను పరామర్శించేందుకు బండారు దత్తాత్రేయ రాగా అప్పటికే తన స్కూటర్‌పై వెళుతున్న ఆయనను దత్తాత్రేయ చూసి మాట్లాడారు.

బర్కత్‌పుర విద్యార్థికి మాస్టర్ పట్టా

కాచిగూడ, బర్కత్‌పురకు చెందిన సెంట్రల్ పీస్ కమిటీ సభ్యుడు, ఈస్ట్‌జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్‌శ్యామ్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు సాయినీరజ్ అమెరికాలోని క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి పట్టా అందుకున్నాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు యుఎస్ఏలో కాన్వొకేషన్ కార్యక్రమానికి వెళ్లి అభినందించారు.

– కాచిగూడ, మే 14

పోలింగ్ నాడు సెలవు ఇవ్వని సంస్థలపై కేసులు

చిక్కడపల్లి, మే 14 : పోలింగ్ నాడు సెలవు ఇవ్వని సంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేశామని అడిషనల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దుకాణాలు, పరిశ్రమలు, సంస్థలు కార్మికులు, ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని 22 – 3– 2024న అధికారంగా ప్రకటించామని తెలిపారు. అధికారులు తనిఖీలు, ఫిర్యాదు మేరకు 30 కేసులను నమోదు చేశారని తెలిపారు.

లంగర్‌హౌస్‌లో బీజేపీ నాయకుడి హఠాన్మరణం

శ్యాంరావు (ఫైల్)

మెహిదీపట్నం, మే 14 : కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు అల్వాల శ్యాంరావు (52) సోమవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. శ్యాంరావు మృతితో లంగర్‌హౌస్‌లో సోమవారం విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్యాంరావుకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. బీజేపీలో డివిజన్ నుంచి నగర స్థాయి వరకు అనేక పదవుల్లో కొనసాగిన శ్యాంరావు మృతి పార్టీకి తీరని లోటని లోక్‌సభ నియోజకవర్గం కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి, కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, నియోజకవర్గం కన్వీనర్ ఆకుల గోవర్ధన్, నాయకులు వినేశ్ సింగ్, నాగేంద్రప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. లంగర్‌హౌస్ సంగంలో సోమవారం సాయంత్రం శ్యాంరావుకు పార్టీలకు అతీతంగా లంగర్‌హౌస్ ప్రజలు, నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు.

యువకుడు ఆత్మహత్య

అబ్దుల్ షోయబ్ (ఫైల్)

కవాడిగూడ, మే 14 : ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట బండమైసమ్మ నగర్ నివాసి అబ్దుల్ రజాక్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దవాడైన అబ్దుల్ షోయబ్ (20) నిరుద్యోగి. రెండేండ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి రెండు కిడ్నీలు పాడయినాయి. దాంతో అతడు ఇంట్లోనే ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులకు అబ్దుల్ షోయబ్ ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే గాంధీనగర్ పీఎస్‌కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేసుకున్న పోలీసులు గాంధీ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నయీం తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

కాచిగూడ, మే 14 : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (60) శంషాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం – 2లో కొన్నిరోజులుగా అనారోగ్యంగా ఉంటూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉందని, ఎత్తు 5.3 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

మహిళ అదృశ్యం

మియాపూర్, మే 14: మహిళ అదృశ్యమైన ఘటన మియాపూర్ పరిధిలో చోటుచేసుకున్నది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తకు చెందిన పోచయ్య భార్య సాయవ్వ కూలీ. 7వ తేదీన సాయవ్వ మియాపూర్ అడ్డాకు వెళ్లింది. తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మియాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోషామహల్‌లో తగ్గిన పోలింగ్ శాతం

అబిడ్స్, మెహిదీపట్నం, మే 14 : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 54.72 పోలింగ్ శాతం నమోదైంది. 2014 నుంచి పరిశీలిస్తే పోలింగ్ శాతం క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 55.37 శాతం పోల్ కాగా ఈ ఎన్నికల్లో ఒక శాతం లోపు తగ్గింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 55.37 శాతం నమోదు కాగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 58.59 శాతం నమోదయ్యింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 55.37 శాతం నమోదైంది. ఈ పార్లమెంట్ ఎన్నికలలో గోషామహల్ సెగ్మెంట్‌లో మొత్తం 2,74,522 ఓట్లు ఉండగా 54.72 శాతం నమోదై మొత్తం 1,50,207 ఓట్లు పోలైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ తెలిపారు.

గోషామహల్ సెగ్మెంట్‌లోనే అత్యధిక శాతం..

గోషామహల్ సెగ్మెంట్‌లోనే అత్యధిక శాతం ఓట్లు పోల్ కాగా గెలుపు ఓటములపై చర్చలు మొదలయ్యాయి. అన్ని సెగ్మెంట్ల కన్నా గోషామహల్‌లో పోలింగ్ శాతం 54.72 శాతం నమోదు కాగా ఎవరికి లాభం చేకూరుస్తుందని ఆయా పార్టీల నాయకులు విశ్లేషిస్తున్నారు. పెరిగిన పోలింగ్ శాతం తమకు లాభం జరుగుతుందని బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నారు. పోలింగ్ శాతం పెరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు విస్తృత ప్రచారాన్ని కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు ఓటు విలువను తెలిపేలా కరపత్రాలు పంపిణీ చేశారు. కళాశాలల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి జీహెచ్ఎంసీ సిబ్బంది స్టిక్కర్‌లను అతికించారు. బస్తీల్లో నమూనా ఈవీఎం, వీవీ ప్యాట్‌ను ఏర్పాటు చేసి పనితీరును ప్రజలకు వివరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఏదేమైనా అధికారులు పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకున్న చర్యలు ప్రశంసనీయం.

బస్తీల్లోనూ అధిక శాతం పోలింగ్..

గోషామహల్ నియోజకవర్గంలోని బస్తీలకు చెందిన ప్రజలు అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొనడం. విద్యావంతులు ఈ ఎన్నికలపై అంతగా ఆసక్తి చూపక పోగా బస్తీలకు చెందిన ప్రజలు మాత్రం ఓటింగ్‌లో పాల్గొనేందుకు ప్రత్యేక ఆసక్తి కనబర్చారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఉదయం నుంచే వారు క్యూలు కట్టి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యావంతులు నివసించే ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సందడి కనిపించలేదు.

గెలుపు, ఓటములపై విశ్లేషణలు ..

ఎన్నికలు ముగియడంతో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు గెలుపు, ఓటములపై విశ్లేషణలు చేస్తున్నారు. వివిధ కేంద్రాల్లో విధులు నిర్వహించిన ఏజెంట్ల ద్వారా పోలైన ఓట్ల వివరాలను సేకరించి ఆయా ఓట్లు ఏ పార్టీకి పడతాయనే విశ్లేషణలు చేపట్టారు. తమకు అనుకూలంగా ఉన్న బస్తీల ఓట్లను తమ ఖాతాల్లో నమోదు చేసుకుని గెలుపు, ఓటముల విశ్లేషణలు చేసుకుని కాకి లెక్కల ద్వారా గెలుపు తమదేనని అందరూ ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లు, ఉత్తర భారతీయుల ఓట్లు ఏ పార్టీకి ఎక్కువగా పోలయ్యాయనే విషయంలో నాయకులు బేరీజు వేసుకుంటున్నారు.

కార్వాన్‌లో..

కార్వాన్ సెగ్మెంట్‌లో 51.23 పోలింగ్ శాతం నమోదైంది. కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 3,62,411 ఓటర్లు ఉండగా అందులో 1,85, 681 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని సెగ్మెంట్‌లలో కెల్లా గోషామహల్‌లో అత్యధికంగా పోల్ కాగా కార్వాన్‌లో 51.23 శాతం నమోదై రెండోస్థానంలో నిలిచింది. కార్వాన్ సెగ్మెంట్ నుంచి మజ్లిస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా ఆ పార్టీ అభ్యర్థి, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విజయం కోసం ఎమ్మెల్యే కౌసర్ మొహినొద్దీన్ ఎంతో పాటు పడ్డారు. అంతే కాకుండా అధికారులు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు.

మల్లేపల్లిలో పారిశుధ్య పనులు

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్ –12 పారిశుధ్య విభాగం అధికారులు మంగళవారం చెత్త తరలింపు పనులను చేపట్టారు. వారం రోజులుగా ఎన్నికల నేపథ్యంలో ఆయా పనుల్లో ఉన్న అధికారులు మంగళవారం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి బస్తీల్లో పారిశుధ్య పనులు చేయించారు.

– మెహిదీపట్నం

చురుకుగా డ్రైనేజీ నిర్మాణ పనులు

మల్లేపల్లి డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. మల్లేపల్లి చికెన్ మార్కెట్ చౌరస్తా వరకు రూ.45లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

– మెహిదీపట్నం

గెలుపుపై ఎంఐఎం ధీమా..

ప్రజల మద్దతు తమకే ఉందని హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఎంఐఎం మరోసారి కైవసం చేసుకోవడం ఖాయమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం టోలిచౌకిలో ఎమ్మెల్యే ప్రజలను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజార్టీతో గెలువనున్నారని పేర్కొన్నారు. పోలింగ్‌లో ప్రజలు చురుకుగా పాల్గొన్నారని, పార్టీకి ఓటువేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

– మెహిదీపట్నం